జాతి నిర్మాణంలో యువత పాత్ర కీలకం

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 'జాతి నిర్మాణం-యువత పాత్ర' అంశంపై ఆదివారం ఒక్కరోజు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శైలజ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. గౌరవ అతిథిగా మూడో తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశ నిర్మాణంలో, రక్షణలో వివిధ దళాల పాత్రను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. దేశమే తమకు మొదటి ప్రాధాన్యమని, దేశ రక్షణ కోసం అన్ని త్యాగాలు చేసే లక్షణాలు యువతలో పెంపొందాలని సూచించారు. అదేవిధంగా జాతీయ సమైక్యతపై, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై ఈ సదస్సులో నిపుణులు మాట్లాడారు. ప్రిన్సిపాల్ శైలజ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు రాణించి పతకాలు సాధిస్తున్నారని తెలిపారు. ఆల్ ఇండియా తల్ సైనిక్ క్యాంప్‌లో పతకాలు సాధించిన నీలేష్‌దాస్, అంజలిని సత్కరించారు. ఈ సదస్సుకు కన్వీనర్‌గా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద్ వ్యవహరించగా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లెఫ్టినెంట్ డాక్టర్ పల్లాటి నరేష్, లెఫ్టినెంట్ వసంత్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్లతో అతిథులు

15 శాతానికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పెంచాలి

హిమాయత్‌నగర్: ప్రస్తుతం అమలు చేస్తున్న 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 15 శాతానికి పెంచాలని తెలంగాణ ఓసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి కోరారు. అలాగే రిజర్వేషన్లను పటిష్టంగా అమలు చేయడానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన తెలంగాణ ఓసీ సంక్షేమ సంఘం దశాబ్ది ఉత్సవాల్లో సంఘం ప్రధాన కార్యదర్శి కాచం సత్యనారాయణ గుప్తాతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకున్నారంటూ ఓసీలను ద్రోహులుగా చూస్తున్నారని, రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులాల మధ్య చిచ్చు పెడుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఓసీల ఓట్లతో అధికారంలోకి వచ్చారన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు భూపతి శర్మ, పవన్ కుమార్, తిరుపతి రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, మాధవరెడ్డి, రవికుమార్ గుప్తా, దయాకర్ రెడ్డి, జగన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న ఏనుగు సంతోష్ రెడ్డి, కాచం సత్యనారాయణ గుప్తా

బీసీ రిజర్వేషన్ల కోసం నిరసన

బంజారాహిల్స్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మెంగా శ్యామ్ ఆధ్వర్యంలో బీసీ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో నిరసన వ్యక్తం చేశారు. ఫిలింనగర్ మహనీయుల చౌరస్తాలోని జ్యోతిరావుపూలే, సావిత్రీబాయిపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం నేతలంతా 42 శాతం రిజర్వేషన్ల కోసం నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టబద్ధత తీసుకురావాలని ఈ సందర్భంగా శ్యామ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు కల్పించకపోతే బీసీల పోరాటం రోజురోజుకూ ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుల, మతాలు, పార్టీకతీతంగా ప్రతిఒక్కరూ బీసీ రిజర్వేషన్‌కు మద్దతు ప్రకటించాలన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పంజగుట్ట: త్వరలోనే నిమ్స్ అభివృద్ధి కోసం కూల్చివేస్తున్న ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు కలుసుకునానరు. 1989 బ్యాచ్ విద్యార్థినీ విద్యార్థులు కలుసుకుని ఆటాపాటలతో సందడి చేశారు. ఎర్రమంజిల్ పాఠశాలను నిమ్స్ అభివృద్ధి కోసం కేటాయించగా మెగా ఇంజినీర్స్ వారు ఎర్రమంజిల్ ప్రధాన రహదారిపై మరో పాఠశాల కట్టించారు. ఆ పాఠశాల ఇటీవలే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభమయ్యింది. దీంతో విద్యార్థులకు గత వారం రోజులుగా తరగతులు కొత్త పాఠశాలలోనే జరుగుతుండడంతో పాత పాఠశాల నిమ్స్ వారు త్వరలోనే కూల్చేయనున్నారు. అందుకే తాము చదువుకున్న పాఠశాలలో ఒకరోజు గడుపుదామని వచ్చినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా బిట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సునంద రెడ్డి, కార్యదర్శిగా ప్రేమ్‌రాజ్‌ను ఎన్నుకున్నారు.



పథకాలకు ఆకర్శితులై చేరిక


టీడీపీ, బీఆర్ఎస్ నేతలతో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్

వెంగళరావునగర్: కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని ఇంజినీర్స్‌కాలనీ, శాలీవాహననగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన టీడీపీ, బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కలిసి కట్టుగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు మహానంది, బీఆర్ఎస్ నేత సంతోష్‌గౌడ్ తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీవారి పవిత్రోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఆఖరి రోజు ఆలయంలో స్వామివారికి పూర్ణాహుతి వేడుకలతో పాటు స్వామివారి స్నపన తిరుమంజన పూజలు ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు ఏఈఓ రమేష్, రమణారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కాంగ్రెస్‌కు మద్దతుగా సుమన్ ప్రచారం

వెంగళరావునగర్ : డివిజన్ పరిధిలోని యాదగిరినగర్ బస్తీలో సినీ నటుడు సుమన్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తండ్రి చిన్నశ్రీశైలం యాదవ్, నవీన్ సతీమణి వర్ష యాదవ్‌తో కలిసి ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. ఎలాంటి అధికారం, పదవి లేని సమయంలోనే ప్రజలతో మమేకమై, సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్న నవీన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నవీన్ యాదవ్‌కు సగర సంఘం మద్దతు

రహమత్‌నగర్ : జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు సగర సంఘం మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకుడు భాస్కర్‌సాగర్ పేర్కొన్నారు. ఆదివారం నవీన్‌యాదవ్‌కు కలిసి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా భాస్కర్ సాగర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ద్వారానే సగర కులస్తుల సంక్షేమ సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ విజయారెడ్డి, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.